# మరట్ తుడుం పాయనా (మనందరం తుడుం గొట్టాలే)

సాహూ

మంచెమీద సోయిం లింగు గుప్పిడి (వడిసెల)లో రాళ్లపెట్టి "యాఁ....యాఁ" అంటూ అరుస్తూ రువ్వుతున్నాడు. మందలు మందలుగా రామచిలుకలు, గోరెంకలు, గువ్వలు అరుస్తూ జొన్నకంకులమీద వాలుతున్నాయి. ఈమూలకు రాళ్ల రువ్వితే ఆమూలకు వాలుతున్నాయి. అప్పటికే నాలుగు గోరెంకల్ని కొట్టి బూరుపీకి కాల్చి బుట్టలోవేసుకున్నాడు. ఓపదివరకు దొరికితే ఆపూటకు పులుసుకాయొచ్చు.... ఎండ ముదురుతోంది ఎండ ఎక్కేనాకొద్ది కడుపులో ఆకలి హెచ్చుతోంది. పిట్టలు ఎండ ఎక్కేనాకొద్ది పల్చపడుతున్నాయి.... మంచెమీదినుండి గూడెందిక్కు చేలమీది నుండి చూశాడు. కావలివాళ్ల అరుపులు తప్ప గూడెం నుంచి వచ్చేవాళ్లెవరు కన్పించలేదు. 'భాయి ఇంకా రాకపాయె'నని ఆలోచనలోపడ్డాడు.... దక్షిణంవేపు మళ్లీ గోరెంకల గుంపువాలింది.

"ఓ....యాఁ. దుత్తెరి.... బిత్తపిట్టేరా. తుంత్ణా కష్టెం సగం అవేతించి" (ఏంపిట్టలురా చేసినకష్టం సగం అవేతినే....) అని మనసులో అనుకొని పైకీమాత్రం గుప్పిడీలో రాళ్లపెట్టి గిరగిరతిప్పుతూ రివ్వురివ్వన కొడుతూ అరుస్తున్నాడు. అయినా లేవలేదు. మంచెరగడుకు కట్టినతాళ్లపట్టి ఊపాడు. మంచెరగడు నుంచి చేలోకర్రల దాకా కట్టిన తాళ్లు ఊగినయ్. కర్రలు గలగల ఊగినయ్ ఈసారి పిట్టలు లేసినయ్.

ఆమొండి గుట్టలు చేన్లకావలి వాళ్ల అరుపులతో. పైన ఎగురుతూ కిలకిలలాడే పిట్టల అరుపులతో ప్రతిధ్వనిస్తున్నాయి.... కొందరు రేకుపీపాలు దబడదిబడ బాదుతే. మరికొంతమంది డప్పులుకొడుతూ అరుస్తున్నారు. పెద్దగా అడివిలేదు. ఉన్నఅడవి ఆకులుజాడిస్తూ గుట్టబోర్లమీద బండలు కన్పిస్తున్నాయి.... ఎన్నో ఏండ్లుగా అడివి నరుకబడుతూనే ఉన్నది. మైదానప్రాంతాలల్లోకి కర్రనడిచిపోతూనే ఉన్నది.... మీది కెల్లి అడివి నరికిండ్లని కేసులుమాత్రం గిరిజనులమీద పడుతున్నాయి. ఎత్తుకపోయి నోడు మంచిగనే ఉంటండు. తడుకతీసినోడే దొంగయిపోతండు.... ఇలాంటి చిన్న చిన్న విచారాలు లింగుకు దోచినయ్.... వీటన్నిటికన్నా మిన్నగా లింగుకు కడుపులో ఎలుకలు తిరుగుతున్నాయి.



లింగు మంచెదిగి ఉడా (ఊసబియ్యం) చేసుకుందామని జిడిపీఁ (మద్దితోడు కలుకాల్చి నిప్పుచేసి కాలువడం) తీసి నెగట్లోవేసి మళ్ళీ మంచె ఎక్కాడు. పొగ

లేచింది. మళ్ళీ ఏమనుకున్నడో ఏమో మంచెదిగి జొన్నకర్రల్లో నడుస్తున్నాడు. ఇంతలోనే ఉత్తరంవేపు ఊడుగుపొదల వేపునుంచి కేర్ కేర్ మనే చప్పుడువిన్పించింది. లింగు ఆశబ్దాన్ని గుర్తుపట్టి- కొద్దిగా ముఖం వికసించింది- పాము మాదిరిగా కర్రల్లో నుండి ఆ శబ్దం వచ్చిన దిక్కు- వెళ్ళాడు. దడిపక్క-న పెట్టిన ఉరిలో కుందేలు పడి గిలగిల కొట్టుకుంటున్నది. ఉరితీసి కుందేలుసుతెచ్చి మంచెకింద పెద్ద గంపకింద వేసి మీదినుండి పెద్దబండ బరువుపెట్టాడు. కుందేలు గంపలో కేర్ కేర్ మంటూ గీకుతోంది.

రాత్రికి కుందేలు మాంసం.... నోట్లో నీళ్లూరాయి.

"బేగమాంతాయి. (ఎక్క-డున్నవ్ ?)" పెద్దగా కేకవిన్పించింది....

మంచెకిందఉన్న లింగు సమధానంగా "ఓయ్" అని కేకవేశాడు.

కర్రలు పాతుకుంటూ లింగు భార్య చిన్ని సద్దిమూటతో వచ్చింది. సద్దిమూట కిందబెట్టి మంచెకింద తన భర్త చేసిన పని కళ్లతోనే పరిశీలించింది....

"నువ్విక్క-డ కుందేల్లు - గొర్రెంకలు పడుతాంటే గూడెంలోనికి మల్ల కాకి బట్టలోల్లచ్చి లోటీసు లిత్తండ్లు-" చిన్నిమాట పూర్తి కాకముందే-

లింగు "మళ్ళ కాయిదాలచ్చినయా ?" అన్నాడు కొద్దిగా భెదురుతూ....

"ఆఁ....ఆఁ.... భూములన్ని ఇడ్చిపెట్టాల్నట- లేపోతే ఒక్కొ-క్క- ఊరుసు మళ్ళ ఇందర్ వెల్లి చేస్తరట-" నేలమీద బెడ్డల్లో కూర్చుంటూ చిన్ని....

"మరి గూడెంలో బేదకల్ కాయిదాలు తీసుకున్నరా ?" ముఖంమీద నీళ్లు చల్లుకుని మాటవిప్పుతూ-

"ఎవలు తీసుకోత- గుడిసెలకు అంటిచ్చిపోయిండ్లు-" పిట్టల అరుపులు విన పడగానే మంచెమీదికెక్కి- తనూ అరుస్తూ ఒడిసెల తిప్పసాగింది చిన్ని-

లింగు గడుకముద్దలు నోట్లెబెట్టుకొని కానేపు ఎద్దులాగా నమిలిండు.... మట్టి పెళ్ళలకేసి- గాలికిఊగే జొన్నకర్రలకేసి- కంకులకేసి చూస్తూ తిండాపి విచారంలో పడ్డాడు. హఠాత్తుగా అతనికిగుర్తుకొచ్చి లేచినిలబడి మంచెమీదికిచూస్తూ

"అన్మంతరావ్ దాదాలేడా ?" అని అడిగిండు.

696

"లేడు ఎటుపోయిండో ?" చిన్ని లింగుకేసి చూడకుండానే "యాఁయాఁ" అంటూ మొత్తుకోసాగింది.

చిన్ని మంచెమీది తాళ్ళుకదిలించి. జొన్నకర్రిలు లయగా కదలడంతో చే గొంతెత్తి "రేలా....రేల" అంటూ పాడసాగింది.

లింగుకు నోట్లోవేళ్ళుపోవడంలేదు. ఘుద్దదిగడంలేదు. మళ్ళా గంపలకమ్మిన కుందేలు తిరిగైపోద్దాఏమి ? అనుకున్నాడు. పాటవినబుద్ధికాలేదు. "ఏమోఁపాటాపు" అంటూ బిగ్గరగా కసురుకున్నాడు.

సద్ది మూటకట్టిపెట్టి చెయ్యికడక్కొని పట్టిపెళ్ళల్లో పుల్లతో గీతలుగీస్తూ విచారంలో పడ్డాడు.

"అయితే మళ్ళ ఈభూముల్ల పిచ్చితుమ్మల ప్లాంటేషన్ చేస్తరన్నమాట". తన చిన్నతనం గుర్తొచ్చింది. "ప్లాంటేషన్ చెయ్యద్దు మా సాగుభూముల్ల అన్నందుకు రక్తాలుకారంగకొట్టి. గుడిసెల్ని కాల్చి. ఇండ్లుపీకి. వెంటతేసి. కుండలు పలుగ్గొట్టి. ఇంకాఇంకా ఎన్నోచేసింద్లు. ఆ తరువాత వాళ్ళు తిడక్లకు ఫ్లితిరగడం. కాయిదాలకర్సుకవి. వాడింతవీడింత దొబ్బిపోవడం. ఆఖరుకు భూములు రాకపోవడం. పౌరకలసార్లురావడం. సంగాలుబెట్టడం. తుడుంకొట్టడం. పోలీసులు జంగలాతు వాళ్ళురావడం. కాని ఈసారి 'రెక్కల కష్టంమాది' 'దుడువానికే భూమి పాజిలే'. (దున్నేవాడికి భూమి) అంటూ ఇందర్‌వెల్లికివెల్లడం. అక్కడ తమవాళ్ళ మరణం.... ఈ గడబిడ గడిచిపోయి పోకముందే. పౌరకలసార్లు అరెస్టురావడం. మళ్లా కొత్తసారురావడం. మనలడాయి ఆగేదిగాదు. మనకు భూమిదక్కేవరకు లడాయి చెయ్యాలనడం గూడెంలోవాళ్ళంతా మనభూములు మనకేఉండే ఇంకెవలత్తరు సారు పట్టాఉంటేంది లేకుంటేంది అనడం. సౌకిదార్ల బాదలేదనుకుంటె పోయినభూములు వచ్చినయని సంబురపడుతుంటె. సార్లు వత్తాండ్లు పోతాండ్లు. మల్ల గిదేంది సమఝ్‌కాలేదు" లింగు నెత్తిగోక్కొని లేచినిలుచున్నాడు.

గబగబ మంచెఎక్కి పక్కమంచె రాజేశ్వర్రావు ఉన్నాడేమోనని చూశాడు. మంచెమీద బుర్రిమీసాలతోని రాజేశ్వర్రావు కూసున్నడు. వాడివి లపక్క గూడెం. శివార్లు కల్సిఉన్నయి....

"మరి గరాజేశ్వర్రావును అడుగరాదా? ఏం సంగతో మనకు తెలవకపాయె". చిన్ని సలహాచెప్పింది పోటోతూ.

697

"వాడోదొంగ. సర్కార్‌బంటు. వానికి పట్టాఅచ్చిందట. మొదలెమొ లడాయి జెయ్యాల్నని ఊరూరు తిరిగింకు. మల్ల పోలీసులను కల్సిండు. వాన్ని అడుగుతె

నవ్వతడు. వానికెరికె ఇట్లజరుగుద్దని- నల్లికుట్ల లంజకొడుకు-" లింగు పండ్లు కొరికిండు.

చిన్ని ఏదో గొనుగుతూ కర్రీలు పాపుకుంటూ గూడెందారిపట్టింది. పోతున్న చిన్నిని వెనక్కి పిలిచి "నువ్వు పగటించిదాక ఉండిరా నాకు జెరంతవసున్నది" అంటూ మంచెదిగిండు లింగు.

అప్పటికే ఆవార్త తెలిసిన ఇంకోపక్క మంచె చిక్రిం రాజు పెద్దకేకవేసి లింగును పిలిశాడు.

లింగు చిక్రిం రాజు మంచెకేసి నడిచాడు.

ఇద్దరు కాసేపు మాట్లాడుకున్నారు నెత్తిమీదికి పొద్దచ్చింది- ఈ గండంగడు వాలంటే ఏమిచేయాలో ఎవరికీ తోచలేదు- ఇద్దరు గూడెంవేపు దారితీశారు. దార్లో బక్క, జంగు కలిశారు.... మరికొంతదూరం పోయేసరికి మరో ఇద్దరు కలిశారు. అందరి కళ్లల్లో ఆందోళన.... రెక్కలుముక్కలు చేసుకొని పిచ్చితుమ్మలునరికి రెండేళ్లుగా పంట అనుభవిస్తున్నారు.... ఈసారి మళ్ళా వెనుకటిభాగోతమే- జొన్న కొయ్యనిస్తరో లేదో?

గూడెంలోకి నోటీసులచ్చినయన్నకబురు నిమిషాలమీద చేండ్లల్లోకి చేరిపోయింది. శివార్లుదాటి అన్ని గూడాలల్లోకి చేరిపోయింది- ఏ గూడెంలో చూసిన- ఏగోండు, కొలామ్‌రైతు ముఖంమీద చూసినా ఒకటేమాట- భూములను బేదఖల్ చేయాలట-

లింగు వాళ్ల గూడెం చేరేసరికి బంగ్లాలో (పటేల్ ఇంటిపక్క గూడెంలోకి వచ్చిపోయే అధికార్లకోసం వేసినగుడిసె) చాలామంది జమయ్యారు.

గూడెంపెద్ద సోనేరావు ఉబ్బుచెంపలు కదులుతుండగా ఏదో చెప్పబోతున్నాడు. తాను ఖాయిలుకల్సి గూడెంలోకి వస్తుంటే పోలీసోల్లు కల్సినసంగతది.

"సోనేరావు ఎక్కడున్నడు ఖాయిలనడిగిండొకడు- ఏమో మాకు తెలువది ఖాయిలు అన్నరు. వానిమీద సానకేసులున్నయి మొన్న పొరకలసారును పట్టిచ్చి నోన్ని నరికిన కేసుల వాడున్నడు ఇగ నేను ఖాయిలచాటుకు జరిగిన. వాళ్ళ పక్కనున్న పోలీస్‌పటేల్‌గాడు నన్ను చూడనేచూసిండు- వాళ్ళకుచూపిండు- వాళ్లు నాచెయ్యి

పట్టుకున్నరు. ఇగట్ల భాయిలు ఎగబడ్డరు. టోపీ ఒకలు గుంజుతె అంగిఒకలు లాగిండ్లు వాళ్ల తుపాకులు సదురుకుంట నన్నిడ్సిండ్లు. ఇగ చెంగోబిల్ల అడివిలబడ్డ. నాకోసం వచ్చిండ్లనుకున్న లంజకొడుకులు. అయితే బేదఖల్ నోటీసులు తెచ్చిండ్లన్నమాట."

"జురిత్ లచ్చిండ్లు. గూడెంకచ్చి బొగడమీద నిలుసుండి ఏమి ఎరుగనట్టె సోనేరావు గాడున్నడా అన్నరు. లేడన్నమోలె జైతుదాదాను. మరికొందరిని పిల్చిమీకు నోటీసులచ్చినయ్ అన్నరు." ఒక ముసలవ్వ.

"పట్టాలిస్తండ్లా? అంటునేనడిగిన" జైతుదాద.

"ఇగప్పుడు నవ్వుకుంట. ఆఁఆ పట్టాలే. ఆభూముల్లనుంచి మంచిమాటకు వెళ్ళకపోతే పైదిలోకానికి పట్టాలుదెచ్చినం. మాదెర్.... ఆతిట్లు ఎవలకొస్తయి." రవికెలేని ఒకస్త్రీ పైట బొడ్లోచెక్కుకుంటూ....

"ఇగ ఒక్కొక్కలు బాయిలంత కుప్పకూడిండ్లు. మీరు లోటీసులు తీసుకోండ్లి.' అన్నడో ఎర్రిటిపోలీసు. లచ్చుబాయి 'ఆ నెగట్ల ఏసిపోండ్లి' అన్నది.... వాడు పండ్లుకొరికి మీదిమీదికొచ్చిండు. బాయిలందరు ఆకోపంచూపి నవ్విండ్లు. ఇగ కొడుతదేమొ? ఇండ్లుకాలబెడ్తడేమోనని నాకు భయమైంది. వాళ్ళండ్లవాళ్ళే కయ్యెర బియ్యెర మాట్లాడుకొని గుడిసెలకు కాయిదాలేసిపోయిండ్లు" జైతుదాదా చెప్పుకొచ్చాడు.

అట్లా చాలాసేపు నవ్వుతూ, పండ్లుకొరుకుతూ విన్నారు. ఎవలకుతోచింది వాళ్ళు చెప్పుకొచ్చారు. కాని ఇగ గిదిచేద్దామని ఎవలు చెప్పలేకపోయారు.

ఆఖరుకు సోనేరావు కలుగజేసుకొని "గిసొంటిమాటలు మనందరికన్న లింగుకే బాగెరుక." అన్నాడు.

లింగు ఆలోచనగా "నాకుమాత్రం ఏమెరుక?" అన్నాడు.

"నీకెరుకలేకుంటె ఎవలకు తెలుస్తది. నువ్వు సంగానికిపెద్దవు. పోరకల సారును తీసుకొచ్చి భూములుతెచ్చింది నువ్వుకాదా?" అంబతిరావు.

"ఏంచేద్దాం లింగుదాదా! పోరకలసార్లుంటే మంచిగుండు" ఒక ముసలివాడు చుట్టతాగుతూ.

లింగు తుపుక్కున ఊంచిండు. అది దూరంపడక తన గడ్డంమీదనేపడ్తే తుడుచుకుంటూ." గుడ్డొచ్చినంక గూడుగావాలని ఎతికితిమి. మనం ఏదచ్చిన తుడుం

గొట్టాలెనని అనుకుంటిమి. ఒక్కోడుగొడ్తిమి. గూడేలల్లకొచ్చిన కాకిబట్టలోల్లను అన్ని గూడాలల్లోల్లం గలిపి తరిమితిమి. భూములచ్చే. ఇగ మన శెవడ్డం. ఊకె కొట్లాటేనా అని తుడుం ఆపితిమి. సార్లు పట్టాలకు కదులుమంటె ఎందుకంటిమి. బాందే (తుపాకి) లట్టు (దుడ్డు) బట్టంది భూమిదక్కదంటే నాలెకుమొకమే స్తిమి.... సార్లొచ్చిండ్లంటె తలోదిక్కుపోబడ్తిమి." లింగు చెప్పుకపోతున్నాడు....

"అదంతా సరేలింగూ.... ఇప్పటిసంగతి చెప్పు." జంగువినుగ్గా....

"ఇప్పుడు సారెక్కడున్నదోకదా? విచారం చేద్దామంటే నాకైతే ఎటూదోత్త లేదు." లింగు....

"గట్లంటెఎట్ల? సార్లకు గీసంగతి తెలుస్తది.... సార్లువస్తరు....పోనీ సార్లచ్చె నంక మనమేంచేద్దాం" సోనేరావు అటిటుచూసి ఓ ఇప్పమొద్దుమీద కూలబడుతూ.

"ఇగోసోనేరావు నువ్వు ముందటబడాలే. నాకనిపిచ్చేదేందంటే. మల్లమనం గూడెం గూడెందిర్గి మనోల్లందర్ని కుప్పెయ్యాలె. విచారంచెయ్యాలె." జంగు అన్నాడు.

"బాగనేఉన్నది నామాట ఎవలింటరు?" సోనేరావు.

"గదేంది. నువ్వకొద్దోగొప్ప సారుతోటి పోనేబడ్తివి. నిన్నే మేంసారను కుంటం. మనమే ముందటబడాలెగదా?" జంగు అందరికేసి చూశాడు తన మాట ప్రభావం ఎట్లున్నదో గమనించడానిక్కి.

"అందరు గట్లంటెసరే. కని హనుమంతరావన్న ఉన్నబాగుండు. సంగంలో అందరికన్న పెద్దగదా! అయినమీద లేనిపోని కేసులుబెట్టిరి. అయినె కేసులనుట్టు తిర్గడానికే సరిపాయె. గిట్ల కేసులుబెడ్తండ్లు గన్కనే మనసార్లు సాటుసాటుకు తిరుగు తండ్లు. మనపొరకలపార్టీ బలంపెరిగేదన్క గిదితప్పదేమొ?" సోనేరావు

"గిట్ల ముంగటబడ్డోళ్ళమీద కేసులుబెట్టి జేల్లపాలుజేత్తె ఇగ లడాయి ఎవలు నడిపియ్యాలె. భూములెట్లరావాలే. మనమే ముందటబడాలే. వాళ్ళను మనంకాపాడు కోవాలే. మనబలం పెంచుకోవాలే. భూములులేంది బువ్వలేదు. బువ్వలేంది బతుకు డెట్ల? సర్కారోడు తుపాకులతోని గాల్పిచ్చె. మీదికెల్లి గుడిసెలమీదికి పెంక లంటడు. బోరింగంటడు. దారులంటడు. తొవ్వలంటడు. గియ్యన్ని నెత్తిలకొట్టు కుంటమా? భూములిత్తె అన్నిచ్చినట్టె. వాడెందుకిస్తడు? పీనవ్వను బెయిన్‌మాచ్చ (ఇదొక గోండుతిట్టు) రాజు లొడలొడ వదురసాగిండు.

"సరే! సరే నేను అందర్నికలుస్తా! అందరితోని మాట్లాడ్తా! రాజు దాదా నాతోవత్తవా?" సోనేరావు.

"ఆఁ వత్తపా" రాజు.

"ఇగ సారువస్తె మేము గిట్లపోయినమని చెప్పండ్లి- సార్లే మమ్ముల ఎక్కడున్న కలుస్తరు." అంటూ సోనేరావు ముగించాడు....

అక్కడి నుండి ఎప్పుడు వెళ్ళాడో జంగు బొగడమీద తుడుం మోగించ సాగిండు...

*　　　*　　　*　　　*

సాయంత్రిం సూర్యుడు గుట్టల్లో ఒదిగి ఒదిగి ఎర్రెర్రిగా వెలుగుతున్నాడు- పక్షులు గుంపులు గుంపులుగా లొల్లిచేస్తూ గాలికి చెల్లాచెదురైనట్లుగా లేస్తున్నాయి.... ఒక గూడెంలో తుడుం మోగింది- అలలు అలలుగా పైరగాలిలో తేలిపోతూ బండలను, కొండలను, చెట్లను, చెట్లకొమ్మలనుముట్టేసి ఒకగూడెం నుండి మరోగూడెం చేరుతోంది- దానికి సమాధానంగా మరో గూడెంలో తుడుంమోగ్రింది.... అడివిల జంతువులు బెదిరిపోయేవిధంగా తుడుంమోత....

జనం బొగడగూడెం దిక్కుగా నడుస్తున్నారు.... సూర్యుడు కుంగిండు- ఎన్నెల పైకెక్కవచ్చింది....

బంగ్లాలో అప్పటికే చాలామంది ఉన్నారు. వచ్చేవాళ్లు వస్తున్నారు- బంగ్లా ముంగటి నెగట్లో డికాషన్ మరుగుతోంది.... ఖాయిల వచ్చిన అతిథులకు తాగమని యిస్తున్నారు. పెద్దపెద్ద నెగళ్లు వేశారు- మంటవెలుగులో అందరిముఖాలు ఎర్రెర్రిగా.... వెలతెలాబోతూ పైన చల్లగా తెల్లగా వెన్నెల....

హన్మంతరావు మందిలో నుంచిలేచి "మీకందరికీ రాంరాం" అన్నాడు.

అందరు గొనిగినట్లు "రాంరాం దాదా రాంరాం" అన్నారు.

హన్మంతరావు సన్నగాఉన్న చెయ్యెత్తి గాలిలో తిప్పుతూ "మనం బాగా కరే మాయినా (తెల్సుకోవాలె) మల్ల ఇప్పుడు ఊరూరికి బేదఖల్ నోటీసులొత్తన్నయి. ఇంకాకొత్తగా భూములు కావాల్సిన వాళ్లు అడివి నరుకుతనేఉన్నరు. మనం పంట దీసేటందుకు ఎంతకష్టపడ్తమో? భూమి దక్కిచ్చుకోను అంతకష్టపడాలె- మావా రెక్కలకష్టెం- మావాభూమి- అందుకనే మనపొరకలపార్టీ సంగం "ఊడువానికే

701

భూమి ఫాజీలే" అంటంది- అంటే ఏందన్నమాట- దున్నేటోడు తన భూమి తనే కాపాడుకోవాలే- మనం ఊకుంటే మళ్ళ చేండ్లు బీడుబెట్టి పిచ్చితుమ్మలు మొలిపిస్తరు. బాగా ఆలోచించుండ్లి- రేపు పోలీసులు బేదఖల్ చెయ్యమంటవస్తె మనం తుడుంగొట్టి గిట్లనే జమైై ఎదుర్కోవాలె- మీకు వచ్చిన బేదఖల్ కాయిదాలు తీసెగట్లవేస్తరా ? భూముల్లనుంచి తొలిగిపోతరా ?"

"సిల్లే సిల్లే వాటోట్ రే నెగడ్తా" (లేదులేదు ఎయ్యండ్లిర నెగట్ల) వందల గొంతులు....

"ఊడువానికే భూమి పాజీలే" ఎవడో మందిలోనుంచి మొత్తుకున్నాడు.

అందరు గొంతుకలిపారు- గుట్టలు దద్దరిల్లాయి-

"మరట్ సందీర్ ఓంది ఆయానా" (మనందరం ఒక్కటిగావాలె)

మరట్ తుడుం పాయానా (మనందరం తుడుం గొట్టాలే)"

అరుపులు - నినాదాలు.

"ఎప్పుడు ఎక్కడ పోలీసులొచ్చిన మనంతుడుంగొట్టాలే- మనం గీ లడాయిల ఊరికిద్దరం సార్లతోని షరీకుగావాలె- వాళ్ళ లట్టులతోనివస్తే మనం లట్టులేపడుదాం వాళ్ళ మాటలతోనిపస్తె- మనం మా కు భూ మి కా వా లె న ం దా ము- వాళ్ళ తుపాకులుతెస్తే మనం తుపాకులుబట్టాలె- ఇందర్‌వెల్లివీరుల గుర్తుకుతెచ్చుకోండ్లి- కొమురం భీందాదాను యాదికితెచ్చుకోండ్లి-" హనుమంతరావు మచ్చలముఖం ఎర్రగా మెరుస్తోంది.

జనం ఆ మెరుపు తమ గుండెలకు అద్దుకుంటున్నరు. గతంలోజరిగిన పోరాటాలు ఇందర్‌వెల్లి- ఎర్రకొండా- పొరకలసార్లు-

"మరట్ బాండే పియ్యానా (మనమే తుపాకి పట్టాలే.)

మావారాజ్జెం వాయానా (మనరాజ్జెం రావాలే)

మనకు సుఖం మందానా (మనకుసుఖం దక్కాలే)

అరుస్తూ, నినదిస్తూ జనం ఎవరిగూడాలల్లోకి వాళ్ల వెళ్ళిపోతున్నారు.

భర్త ఇంకారాకపాయెనని మంచెమీద ఎదురుచూస్తూ చిన్ని ఒంటరితనాన్ని పారదోలడానికి కాసేపు "రేలా.... రేలా...." అంటూ పాడుతోంది....

702

లింగు అడ్డదిడ్డంగానడుస్తూ "బాండే" గురించి ఆలోచిస్తూ చేనుకేసి రాసాగిండు.... అతని మనసులోసాగే ఆలోచనలు చిన్నికేంతెలుసు పాపం....